క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి



సూళ్లూరుపేట రూరల్: అధికారుల దృష్టికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తీసుకువచ్చే సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ ప్రమీలారాణి అధ్యక్షతన సర్వ సభ్యసమావేశం నిర్వహించారు. హౌసింగ్ ఏఈ దృష్టికి సమస్యలను తీసుకెళ్లినా స్పందించడం లేదని కుదిరి సర్పంచ్ బి. చెంగయ్య ఆరోపించారు. ఎంపీపీ మాట్లాడుతూ తీర ప్రాంత గ్రామాల్లో తాగు నీటి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉన్నందున నీటి కొరత ఏర్పడిందని తెలిపారు. తహసీల్దార్ కన్నంబాకం రవికుమార్ పాల్గొన్నారు.

మొబైల్ షాపులో చోరీ

కలువాయి: మండల కేంద్రంలోని ఎస్ఎస్‌బీ మొబైల్ దుకాణంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడి కథనం మేరకు.. మండల కేంద్రంలోని ఎస్ఎస్‌బీ మొబైల్ షాపు యజమాని శుక్రవారం రాత్రి వ్యాపారం ముగిసిన తరువాత దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం వచ్చి దుకాణం తెరిచిన చూడగా షాపు పైకప్పునకు ఉన్న రేకులు తొలగించి, దుకాణంలో వస్తువులు అపహరించి ఉండడాన్ని గుర్తించాడు. ఈ మేరకు దుకాణ యజమాని హరి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు రూ.3 లక్షలు విలువ చేసే స్మార్ట్‌ఫోన్‌లు చోరీకి గురయ్యాయని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్ఐ మహేంద్ర కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధికి ప్రణాళికలు

చిల్లకూరు: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల అభివృద్ధికి ప్రణాళికలను సిద్ధం చేసి, జగింల్ క్లియరెన్స్ చేపడుతున్నామని ఆర్డీఓ కిరణ్‌కుమార్ తెలిపారు. గురుకుల పాఠశాలలో శనివారం ఆయన పనులు ప్రారంభించారు. ఆయన వెంట పీడీ శ్రీరేష్, చిల్లకూరు ఆర్ఐ రమ్యస్వాతి, విఆర్ఓ రమణయ్య తదితరులు ఉన్నారు.

కండలేరు సందర్శన



రాపూరు/దక్కిలి: మండలంలోని కండలేరు జలాశయాన్ని శనివారం తిరుపతి తెలుగుగంగ సీఈ వెంకటరమణ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు తీసుకోవడంతో సాధారణ తనిఖీలో భాగంగా తెలుగు గంగ కాలువను పరిశీలించినట్లు తెలిపారు. డ్యామ్‌లో ప్రస్తుతం 19.492 టీఎంసీల నీరు నిల్వ ఉన్నాయని, హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,650 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 50, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయిస్‌కు 120 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు అధికారులు ఆయనకు తెలిపారు. అనంతరం కండలేరు హెడ్‌రెగ్యులేటర్, పికప్‌ఏరు, స్పిల్‌వే, ఆల్తూరుపాడు చెరువును పరిశీలించారు. ఆయన వెంట ఈఈలు విజయకుమార్‌రెడ్డి, రాధాకృష్ణమూర్తి, అనిల్‌కుమార్, డీఈ విజయరామిరెడ్డి, ఏఈ తిరుమలయ్య ఉన్నారు.

ఘనంగా జ్యోతిడే

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో శనివారం జ్యోతిడే ఘనంగా నిర్వహించారు. దివంగత నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థలను స్థాపించిన దినోత్సవాన్ని జ్యోతిడేగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఉన్న నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి విగ్రహానికి అధ్యాపకులు, సిబ్బంది, డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, హరనాథ్‌రెడ్డి, కిషంధర్ నివాళులర్పించారు.

ఆహార కిట్ల పంపిణీ

కలువాయి: మండల కేంద్రంలోని క్షయవ్యాధి గ్రస్తులకు శనివారం ఆహారకిట్లను పంపిణీ చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ శివప్రసాద్ తెలిపారు. ఆత్మకూరు ప్రోగ్రాం అధికారి డాక్టర్ సురేంద్రబాబు చేతుల మీదుగా వీటిని పంపిణీ చేశామన్నారు. అనంతరం వెంకటరెడ్డిపల్లెలో డీఎన్ఎంఓ డాక్టర్ సరేంద్రబాబు, వైద్యాధికారి డాక్టర్ శివప్రసాద్, సిబ్బందితో కలిసి కుష్టు వ్యాధి నిర్ధారణ సర్వే నిర్వహించారు.



యువరైతు ఎల్లు మోహన్‌ది పెళ్లకూరు మండలం రోసనూరు గ్రామం. ఈయనకు ఐదు ఎకరాల పొలం ఉంది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో గ్రామానికి చెందిన ఐదుగురు రైతులతో కలిసి(సీహెచ్‌సీ) కస్టమ్ హైరింగ్ గ్రూపుగా ఏర్పడి ఆర్బీకే ద్వారా రాయితీపై ట్రాక్టర్, రోటవేటర్, పది స్ప్రేయర్లు, ఫ్లవ్ నాగళ్లు తీసుకున్నారు. దీంతో ఆయన సేద్యం పనులు సులువు చేసుకుంటున్నాడు. ఇతర రైతులకు వ్యవసాయ పనిముట్లను అద్దెకు ఇచ్చి ఆదాయం పొందుతున్నాడు.



పెళ్లకూరు మండలం పునబాక గ్రామానికి చెందిన అట్ల కృష్ణయ్య రైతు. ఈయనకు పది ఎకరాలు పొలం ఉంది. టీడీపీ పాలనలో విత్తనాలు, ఎరువుల కోసం ఇక్కట్లు పడేవారు. అలాగే ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం జరిగితే పరిహారం అందేది కాదు. ప్రస్తుతం ప్రభుత్వమే పంట బీమాకు సంబంధించి ప్రీమియం చెల్లించడం, ఆర్బీకేల్లో ఎరువులు, విత్తనాలు ఇస్తుండడంతో వ్యవసాయాన్ని పండుగలా చేసుకుంటున్నాడు. అలాగే రైతు భరోసా డబ్బులు పొంది పెట్టుబడికి వినియోగించుకుంటూ సంతోషంగా జీవిస్తున్నాడు.

విత్తు నుంచి విక్రయం వరకు..

- రైతు భరోసా కేంద్రాల ద్వారా పల్లె వాకిటకు సేవలు
- అన్ని దశల్లోనూ రైతుకు చేయూత
- సాగులో అన్నదాతలకు సాయం
- సాంకేతికత బదలాయింపులో కీలక పాత్ర

దుక్కు దున్ని.. ఆరుగాలం శ్రమిస్తేనే రైతు కడుపు చల్లారుతుంది. ఆ రైతు వేసే ప్రతి గింజ మొలకెత్తి పది మందికి పట్టెడన్నం పెడుతోంది. అలాంటి కర్షకులకు రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పిస్తూ..వ్యవసాయ రంగ అభివృద్ధికి వెన్నుతడుతోంది. పల్లె వాకిటకు రైతు సేవలను తీసుకొచ్చింది. వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి సకల సదుపాయాలు కల్పిస్తోంది. విత్తు నుంచి పంట చేతికొచ్చే వరకు కేంద్రాల ద్వారా సహాయ సహకారాలు అందిస్తోంది.



రైతుభరోసా కేంద్రం

- మొత్తం ఆర్బీకేలు: 13
- ఆర్బీకేల పరిధిలో గ్రామాల సంఖ్య: 56
- సేవలు పొందుతున్న రైతులు: 9,432
- పంపిణీ చేసిన ఎరువులు: 2,432 మెట్రిక్ టన్నులు
- విత్తనాలు: 1,240 క్వింటాళ్లు
- రైతు గ్రూపుల సంఖ్య: 16
- సభ్యులు: 80
- పంపిణీ చేసిన ట్రాక్టర్లు: 12
- వ్యవసాయ పరికరాలు: 3 రోటవేటర్లు, 2 బేలర్లు(గడ్డి కట్టే యంత్రాలు), స్ప్రెయర్లు 40, వరికోత యంత్రం 1

పెళ్లకూరు: మండలంలో 13 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా రైతులకు అవసరమైన సేవలన్నీ ప్రభుత్వం అందిస్తోంది. మల్టీ ఫంక్షనల్ కియోస్కల ద్వారా రైతులకు సాంకేతిక సాయం అందిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఆర్బీకేల్లో సబ్సిడీ విత్తనాలు ఇచ్చింది. అలాగే భూసార పరీక్షలు చేయించి, ఆ రిపోర్టు ఆధారంగా ఏ పంటలు సాగు చేయవచ్చు, వాటికి వాడాల్సిన ఎరువులు..ఇత్యాది వాటి గురించి సలహాలు–సూచనలు ఇస్తోంది. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేశారు. పంట దిగుబడి పెరిగేలా వినూత్న సాగు విధానాలను ఆర్బీకేల ద్వారా అవగాహన కలిగిస్తున్నారు. ఈ క్రమంలో గత రబీలో 6,770 హెక్టార్లు, ఖరీఫ్‌లో 5,450 హెక్టార్లు వరి, వేరుశనగ 1,540 ఎకరాల్లో పంట సాగు చేస్తున్నారు.

గతంలో ఏది కావాలన్నా పట్టణాలకే..

గతంలో (వైఎస్సార్‌సీపీ అధికారంలో రాకముందు) ఎరువులు, పురుగు మందులు కావాలంటే పట్టణ ప్రాంతాలకు రైతులు పరుగులు తీయాల్సి వచ్చేది. ఎరువుల దుకాణాల్లో చెప్పిన ధరకే కొనాల్సి వచ్చేంది. అంతేకాకుండా నకిలీ విత్తనాలు, పురుగు మందులతో తీవ్రంగా నష్టపోయే వారు కూడా. ఇప్పుడా ఆ పరిస్థితి లేదు. గ్రామాల్లోనే ఆర్బీకేల ద్వారా ప్రస్తుత ప్రభుత్వం అన్నింటినీ అందిస్తోంది.

అందుబాటులో సేవలు



ఆర్బీకేలు అందుబాటులోకి వచ్చాక రైతులకు వ్యవసాయ సేవలు పుష్కంగా అందుతున్నాయి. గతంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పనిముట్ల కోసం పట్టణాలకు వెళ్లే పరిస్థితి నుంచి ఆర్బీకేల ద్వారా గ్రామంలోనే వ్యవసాయ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

–కట్టా బాలసుబ్రమణ్యం, రైతు తాళ్వాయిపాడు

పుష్కలంగా విత్తనాలు, ఎరువులు



గతంలో విత్తనాలు కోసం గ్రామంలోని రైతులంతా కలిసి దూర ప్రాంతాలకు ట్రాక్టర్లు తీసుకెళ్లి తెచ్చుకొనేవాళ్లం. ఎరువుల కోసం పట్టణాలకు వెళ్లే పరిస్థితి ఉండేది. ఆర్బీకేలు అందుబాటులోకి వచ్చాక గ్రామాల్లోనే ఎరువులు, విత్తనాలు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయి. దాంతో సమయం వృథా, ఖర్చులు తగ్గిపోయాయి.

–ఆళ్ల మణి, రైతు, చిల్లకూరు

రైతులకు అన్నీ సేవలు



మండలంలోని 13 ఆర్బీకేల ద్వారా రైతులందరికీ పూర్తి స్థాయిలో వ్యవసాయ సేవలు అందిస్తున్నాం. పంట నమోదు ప్రక్రియ మొదలు, ధాన్యం కొనుగోళ్ల వరకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటూ రైతులకు మేలు జరిగేలా వ్యవహరిస్తున్నాం. గ్రూపుల ద్వారా అర్హులైన రైతులందరికీ యంత్రాలు, వ్యవసాయ పనిముట్లు అందిస్తున్నాం.

–డాక్టర్ ప్రవీణ, ఏఓ, పెళ్లకూరు

సుపరిపాలనకే అందరి మద్దతు



మోదుగులపాలెంలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

పెళ్లకూరు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, పేదల అభ్యున్నతే ధ్యేయంగా కొనసాగుతున్న జగనన్న సుపరిపాలనకే అందరి మద్దతు ఉందని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. శనివారం చింతపూడి, లక్ష్మీనాయుడుకండ్రిగ, యాలకారికండ్రిగ, గంగరాజుకండ్రిగ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి, బుక్‌లెట్‌లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకతీతంగా అర్హులందరికీ నేరుగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీసీసీబీ చైర్మన్ కే సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ప్రిస్కిల్లా, సచివాలయ కన్వీనర్ రఘునాయుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, అమరేంద్రరెడ్డి, రఘునాయుడు, జితేంద్ర, మణినాయుడు, హరిబాబురెడ్డి, రమణారెడ్డి, బాలు, మస్తానయ్య పాల్గొన్నారు. పెళ్లకూరు మండలం లక్ష్మీనాయుడుకండ్రిగలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ప్రారంభించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

పెళ్లకూరు: మండల కేంద్రమైన పెళ్లకూరు వద్ద శనివారం రాత్రి రోడ్డు దాటుతున్న ఆరేళ్ల అశోక్(30) అనే వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. గుర్రప్పతోట గ్రామానికి చెందిన అశోక్ కొత్తూరులో పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాడుతున్నాడు. ఆ సమయంలో నెల్లూరు–2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు తిరుపతి నుంచి నెల్లూరుకు వెళుతూ ప్రమాదవశాత్తు అశోక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు చేసినట్లు ఏఎస్ఐ సుబ్రమణ్యం తెలిపారు.

జూనియర్ కాలేజీలో రూ.7.5లక్షలు గోల్‌మాల్

నాయుడుపేట: నాడు–నేడు పనులు చేయకనే పనులు చేసినట్లు రికార్డులు సృష్టించి ఆ నిధులు స్వాహాతోపాటు విద్యార్థులు ఫీజులు గుటకాయస్వాహా చేసిన సంఘటనపై పట్టణంలోని శ్రీపెసల గుర్రప్పశెట్టి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వెలుగు చూసింది. శనివారం గుంటూరు ఆర్జేడీ సుబ్బారావు చేపట్టిన విచారణలో ఈ విషయం బయటపడింది. ఈ సందర్భంగా ఆర్జేడీ విలేకరులతో మాట్లాడుతూ రెండో విడతలో జూనియర్ కళాశాలలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఇందులో రూ.5.5లక్షలు నిధులు పోర్జరీ సంతకాలతో కొంత, ముందస్తుగా ప్రిన్సిపల్ సంతకాలు చేసి ఇచ్చిన చెక్కులతో మరి కొంత నగదును జూనియర్ అసిస్టెంట్ విత్‌డ్రా చేశారన్నారు. అంతేకాకుండా కళాశాలలో విద్యార్థులు కళాశాలకు చెల్లించే స్పెషల్ ఫీజులు బ్యాంకులో జమ చేయలేదన్నారు. మొత్తం రూ.7.5 లక్షలు స్వాహా చేసినట్లు తేలడంతో జూనియర్ అసిస్టెంట్ కీర్తి కుమార్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు చెప్పారు. సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపల్ దిలీప్‌పై కమీషనర్‌కు నివేదిక పంపి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని సూచించనున్నామన్నారు. విచారణలో డీఐఈఈ మధుబాబు, ప్రిన్సిపల్ దిలీఫ్ పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుకు సహకరించాలి

కోట: ఓటర్ల నమోదుకు బీఎల్వోలతో కలసి సహకరించాలని తహసీల్దార్ పద్మావతి రాజకీయ నాయకులకు సూచించారు. శనివారం తన కార్యాలయంలో పలు రాజకీయ పక్షాల నాయకులతో తహసీల్దార్ సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ, టీడీపీ, బీజేపీ, బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా నృసింహుని కల్యాణం

రాపూరు: పెంచలకోనలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం 4 అభిషేకం, 5 గంటలకు సుప్రభాతం, 6 గంటలకు పూలంగిసేవ నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఊజంల్‌సేవ నిర్వహించారు.

ఈ-పంట నమోదు చేయించుకోవాలి

దక్కిలి: ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన ప్రతి పంటకూ తప్పనిసరిగా ఈ– క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏడీఏ నాగార్జునసాగర్ తెలిపారు. మండలంలోని చావలపల్లెలో ఎంపీపీ జీ రాజశేఖర్, ఏఓ విజయభారతితో కలిసి ఈ– క్రాప్ నమోదును పరిశీలించారు.

లబ్ధిదారుల వివరాల పరిశీలన

నాయుడుపేటటౌన్: మండలంలోని బిరదవాడ వద్ద నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లకు సంబంధించి రుణాలు మంజూరు కాని లబ్ధిదారులు వివరాలను శనివారం పరిశీలన చేశారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టిడ్కో సీఎల్‌టీసీ మునీర్, మెప్మా సీఎంఎం ఎస్ సోమకుమార్ పలువురు లబ్ధిదారులతో మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొంత మంది లబ్ధిదారులకు వయస్సు ఎక్కువగా ఉండడం, మరికొంత మందికి బ్యాంక్‌లో సిబిల్ సమస్యలు ఉండడంతో రుణాలు మంజూరు కాలేదని నిర్ధారణ అయ్యింది. ఈ సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నాయుడుపేటటౌన్: ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు పోలీలు తెలిపారు. పోలీసులు కథనం మేరకు.. మండలంలోని మేనకూరుకు చెందిన ఎద్దుల శ్రీనివాసులు రెడ్డి(56) మద్యానికి బానిసై తరచు నగదు కోసం భార్యను ఇబ్బందులు పెడుతుండేవాడు. ఈ క్రమంలో రెండు రోజులు కిందట మద్యం తాగేందుకు నగదు ఇవ్వాలని భార్య భువనేశ్వరిని అడగడంతో ఆమె నగదు ఇవ్వలేదు. దీంతో ఆగ్రహించిన శ్రీనివాసులు రెడ్డి పురుగులు మందు తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు నెల్లూరులోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు

చిల్లకూరు: మండలంలోని కలవకొండలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గూడూరుకు చెందిన బీ వెంకటరెడ్డి, శ్యామలమ్మ, కలవకొండ గ్రామానికి చెందిన ఎస్ వెంకటరమణయ్య, శైలజ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ఆరోగ్య పరిరక్షణలో మేము సైతం..



దొరవారిసత్రంలో క్లోరినేషన్ చేయిస్తున్న వలంటీర్(ఫైల్)

దొరవారిసత్రం: మండల కేంద్రంలో కరోనా సమయంలో ఓ బాలకలకు కరోనా పాజిటివ్ రావడంతో ఆ ప్రాంతానికి చెందిన వలంటీర్ సుమలత వెనకడుగు వేయకుండా అధికారులు, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి గ్రామంలోని అన్ని వీధుల్లో క్లోరినేషన్ చేయించింది. కరోనా సోకిన బాలికను క్వారంటైన్ సెంటర్‌కు తరలించే విషయంలో వలంటీర్ ముందుడి, సాయపడింది. కరోనా సోకిన బాలిక కుంటుబ సభ్యులు బయట ప్రాంతంలో తిరగకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ఆ సమయంలో వలంటీర్ ఆ కుటుంబానికి అవసరమైన నిత్యావసర సరుకులు, పాలు తదితర సామగ్రి సమకూర్చి ఆదుకుంది. వీధుల్లో క్లోరినేషన్ చేయించడంతో పాటు హైపోక్లోరైట్ ద్రావణం వీధుల్లో, ఇంటి ఆవరణాల్లో పిచికారి చేయించే విషయంలో కీలపాత్ర పోషించింది.

భయపడకుండా సహాయక చర్యలు



సహాయక చర్యలు అందించే విషయంలో వలంటీర్లు భయపడకుండా ముందుకు సాగారు. రెడ్‌జోన్లలో జన సంచారం లేకుండా తగు చర్యలు తీసుకోవడంలో వలంటీర్లు కీలకపాత్ర పోషించారు. కరోనా ప్రబలకుండా ఎప్పటికప్పుడు వీధులు, ఇళ్ల ఆవరణల్లో క్లోరినేషన్ చేయించారు. జనం కరోనా బారీన పడకుండా కృషి చేశారు. వారి సేవలు మరువలేనివి.

–ప్రసాద్‌నాయుడు, డీవీ సత్రం

వైఎస్సార్‌సీపీలో చేరిన నేతలకు ప్రాధాన్యం



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులతో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనా దక్షత నచ్చి ఇతర పార్టీల నుంచి వైఎస్సార్‌సీపీలో చేరే నాయకులకు తగిన ప్రాధాన్యత ఇస్తామని వైఎస్సార్ సీపీ తిరుపతిజిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కె ఉప్పరపల్లె, యాతలూరు, చిన్నప్పరెడ్డిపల్లె తదితర గ్రామాలకు చెందిన పలువురు టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. నేదురుమల్లి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు రమణయ్యనాయుడు, మాజీ సర్పంచ్ సాయిమోహన్‌రెడ్డి, పప్పు మోహన్‌రెడ్డి, ఉప్పరపల్లెకు చెందిన కోటి, నారాయణరెడ్డి, తిరుపాల్‌రెడ్డి, యాతలూరుకు చెందిన భాస్కర్, కె కృష్ణయ్య, పాపిరెడ్డి, ఎస్ వెంకటరమణయ్య, వేణురెడ్డి రాజారెడ్డి ,శివారెడ్డి, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తిరుపతిజిల్లా ప్రచారవిభాగం అధ్యక్షుడు ఎస్ సురేష్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కే శ్రీనివాసులు రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు నాగయ్య పాల్గొన్నారు.

రీ సర్వే సమగ్రంగా చేయాలి



మాట్లాడుతున్న జేసీ బాలాజీ

దక్కిలి: మండలంలో రీ సర్వే సమగ్రంగా చేయాలని జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం భూముల రీ–సర్వేపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో విలేజ్ సర్వేయర్లు రీ సర్వేని త్వరతగతిన పూర్తి చేసి, తప్పులు లేకుండా రైతులకు న్యాయం చేయాలని సూచించారు. తహసీల్దార్ రమేష్‌బాబు, డీటీ హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల కోసమే జగనన్న సురక్ష



గూడూరు రూరల్: ధ్రువపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

గూడూరురూరల్: పేదలందరికీ పథకాల లబ్ధి అందించాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు తెలిపారు. శనివారంఅశోక్‌నగర్, ఇందిరాగనర్–1, దివిపాళెంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, బీ విజయకుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు బీ శ్రీనివాసులు, జేసీఎస్ మండల కన్వీనర్ రాఘవరెడ్డి, నాయకులు నరసయ్య, అజీజ్‌ఖాన్, ప్రసాద్‌గౌడ్, బీ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

భవితకు రక్ష

రాపూరు: జనన్న సురక్ష కార్యక్రమం ప్రజల భవితకు రక్షని జెడ్పీ సీఈఓ చిరంజీవి, రైతు సంఘం నేతు బీ పట్టాభిరామిరెడ్డి అన్నారు. రాపూరులో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయమ్మ, ఎంపీటీసీ గౌరి, తహసీల్దార్ సుభాషిణి, పార్టీ కన్వీనర్లు పిచ్చిరెడ్డి, రమణయ్య పాల్గొన్నారు.

చిల్లకూరు మండలంలో..

చిల్లకూరు: మండలంలోని నెలబల్లిరెట్టపల్లె, తొణుకుమాలలో జరిగిన కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సురేష్, ఎంపీడీఓ నిర్మలాదేవి, ఎంపీటీసీ సభ్యులు ఎల్లసిరి జానకిరామ్, బీ సుజాత, సర్పంచ్‌లు త్రివిక్రమ్‌భూపతి, డీ మల్లికార్జునరెడి పాల్గొన్నారు.

పూడి, కొండూరులో..

తడ: మండలంలోని పూడి, కొండూరు జరిగిన కార్యక్రమాల్లో తహసీల్దార్ జయజయరావు, ఎంపీడీఓ ఆమోసుబాబు, ఎంపీపీ కే రఘురెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ఆరే సుందర్‌రెడ్డి, సర్పంచ్‌లు పరమశివంరెడ్డి, వీ శ్రీలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు జీ జయంతి పాల్గొన్నారు.

కర్రబల్లవోలులో..

ఓజిలి: మండలంలోని కర్రబల్లవోలులో జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రసాద్‌నాయుడు, సర్పంచ్‌లు సురేష్‌రెడ్డి, వసంతమ్మ, వీరమ్మ, ఉమామహేశ్వరీ, జేసీఎస్ మండల కన్వీనర్ ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

బంగారంపేటలో..

పెళ్లకూరు: బంగారంపేటలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కి లా,నేతలు రఘునాయుడు, మోహన్, సునీల్ పాల్గొన్నారు.

పుదూరులో..

నాయుడుపేట: పుదూరులో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ ఎం సుమతి, ఎంపీటీసీ సభ్యురాలు నరసమ్మ, ఉప సర్పంచ్ పీ మణి, పార్టీ మండల కన్వీనర్ టీ సుబ్రమణ్యంరెడ్డి, పాల్గొన్నారు.